కథా నిలయం
3455
శ్రీకాకుళం

# అత్తగారూ నరసమ్మాయణం



''ఓ వంటాయనోయ్!....ఎదపసచ్చినోడు!....యినపడీ పలకడు-యీణ్ణి పొయిలో బెట్ట! ఓ వంటాయనోయ్!....''

"అబ్బబ్బ!....ఆ పనిమనిషిని కాస్త అరవద్దని చెప్పు....ఒకే కేక లేస్తోంది...." అంటూ మావారూ....

"అబ్బబ్బ!....ఏమిటమ్మా ఆ పనిమనిషి-రాక్షసిలా అరుస్తోంది....దాని కేకల్తో నా చదువు సాగడంలేదు...." అంటూ మావాడూ

కొత్తగా మాయింటి కొచ్చిన గుంటూరు పనిమనిషి మీద చీకాకు పడటం మొదలెట్టారు ...

''దొరక్క దొరక్క యింతకాలానికి ఒక పనిమనిషి మన వేపునుంచి వచ్చింది. అచ్చ తెలుగుదీ, కష్టపడి పనిచేసే ఒక మగాడదీ దొరికిం"దని మా అత్తగారూ, నేనూ ఎంతో మురిసిపోయాం....వచ్చిన కొత్తల్లో ఎంతో వినయంగా మాట్లాడేది....ఎంతో సంతోషించాం....''జీవితాంతం మీ పాదాల కాడ పడుంటాను, నాకు ఎవరూ లే" రన్నది....ఆనందించాం....తన మొగుడు తనను వదిలేసి ఎవత్తెనో పెళ్లాడా డన్నది....''అయ్యోపాపం!" అనుకున్నాం....అన్నిపన్లూ చేస్తానంది....

"ఒడ్డూ పొడవూ గల ఆడది. యింటిపన్లన్నీ బాగా చేస్తుంది....యింటిపట్టునే పడుంటుంది....సాయంకాలం ఆరుగంటలు కాగానే టైమ్ ప్రకారం వెళ్లిపోదు ...కాస్త నా వీపుకు అమృతాంజనం అన్నా పట్టిస్తుంది. ఏ వేళప్పుడైనా యింట్లో పనిమనిషి వుంటే ఆ దారి వేరు...." అంటూ మా అత్తగారు ఆనందపడి పోయారు

వచ్చిన మర్నాడు తెల్లవారేసరికల్లా యింటిపనంతా చేసేసింది....మా అత్తగారి మడిపాత్ర లన్నీ తళతళమనేట్లు తోమి తులసికోటదగ్గిర

బోర్లించి పెట్టింది.... ఆమె వంటచేసుకునే మడి బొగ్గులకుంపటి తుప్పు వదిలించి కొత్తకుంపటిలా తోమిపెట్టింది.... యింటిముందూ, తులసికోట చుట్టూ రకరకాల ముగ్గులు వేసింది.... మజ్జిగ చిలికి వెన్న తీసిపెట్టింది.... యిల్లంతా చిమ్మి, తుడిచీ అద్దంలా చేసిపెట్టింది.... శుక్రవారం అన్ని గడపలకూ పసుపు కుంకుమలు పెట్టింది.... వేణ్ణీళ్లు కాచి మా అత్తగారి స్నానానికి రెడీ చేసింది....

మా అత్తగారు నిద్ర లేస్తూనే పనిమనిషి చేసిందంతా చూసి, "ఆహా! ఆహా!.... ఎంతకాలానికి, ఎంతకాలానికి.... మనవైపు పనిమనిషి దొరికి, యిల్లూ పాత్రలూ యింత శుభ్రంగా కళకళలాడుతూ చూడగలిగాను!...." అంటూ బ్రహ్మానంద పడిపోయి "ఒసే నరుసూ!" అంటూ ఆ పనిమనిషిని పిల్చారు.... దాని పూర్తిపేరు నరసింహమ్మ....

"ఏంది పెద్దమ్మగారూ!".... అంటూ అతివినయంగా మా అత్తగారి ముందు నిలబడ్డది....

ముఖంనిండా పసుపుపూసుకుని, కండ్లనిండా కాటుక పెట్టుకుని, తల నున్నగా దువ్వి పూలు పెట్టుకుని, రూపాయంత బొట్టు పెట్టుకుని గ్రామదేవతలా కనిపిస్తున్న నరసమ్మను చూసి మా అత్తగారు తృప్తిగా చిరునవ్వు నవ్వి:.... "చద్దెన్నం తిన్నావా!" అని అడిగారు, ఆప్యాయంగా.

"ఆ, తిన్నానం డమ్మగారూ"....అన్నది, కాస్త సిగ్గుపడుతూ నరసమ్మ....

"అట్లాగే పెందలాడే చద్దెన్నం తినేసేస్తూవుండు.... అప్పుడే నీవు యింతచాకిరీ చెయ్యగలుగుతావు".... అంటూ స్నానానికి వెళ్ళిపోయారు.

మా అత్తగారు భోంచేస్తూనే—ఆమె కాళ్ళు పట్టడం, కాసేపు ఆమె నడుముకూ, వీపుకూ అమృతాంజనం పట్టించి మర్దన చేయడం, యింకా ఆమె కిష్టమైన పన్లన్నీ కొన్నిచేస్తూండడంవల్ల మా అత్తగారి అభిమానాన్నీ, ఆదరాన్నీ నర్సమ్మ యిట్టే సంపాదించుకుంది.

నరసమ్మ వచ్చి మూడురోజులే అయింది. నాలుగవరోజునుండీ నిద్రకాస్త లేటుగా లేవడం మొదలెట్టింది

పాత్రల తళతళా, యింటి నిగనిగా కాస్త తగ్గాయి. వంటాడు పిలిస్తే "ఎహ వుండు! ఎదవగోల.... వూరక 'అది నూరూ, యిది రుబ్బూ' అంటూ పేణాలు తీత్తుండావ్...." అంటూ విసుక్కోడం నా చెవినిపడ్డది—మా అత్తగారి చెవిని పడ్డదో లేదో మరి!

వారం రోజు లయింది.... పాత్ర సామాన్లు యింకా తోమలేదనీ, కాఫీ ఫిల్టరు యింకా కడగలేదనీ, పెద్దమ్మగారి స్నానానికి యింకా బాయిలర్ అంటించలేదనీ, మజ్జిగ చిలకలేదనీ, యిల్లంతా యింకా చిమ్మలేదనీ వంటవాడి 'కంప్లెయింట్స్' ఆరంభం అయ్యాయి.... అవన్నీ విన్న మా అత్త గారి ముఖంలో కొద్దిగా ఆందోళన కనిపించింది.

ప్రొద్దుటే స్నానం చేసి పట్టెడు కుంకుమతో కళకళలాడుతూ పని చేసే నరసమ్మ కాస్తా వారంరోజులు అయ్యేసరికి లేటుగా నిద్ర లేవడం, విసుక్కుంటూ, మూలుక్కుంటూ, చెయ్యి బెణికింది అంటూ పాత్రలన్నీ ఎత్తి పడెయ్యడం మొదలెట్టింది.

పెద్దమ్మగారు కాళ్ళు పట్టడానికి పిలిస్తే "వుండండమ్మా వస్తన్నానూ! అసలే పన్లు తెమలక సస్తుండా ఎదవ సచ్చినోడు — యీ వంటోడు పాతర్లన్నీ ఒక్కసారేసి తగలడితేగదు! చేతి కేదోరోగం ఒచ్చింది. వూరికే కుక్క నమిల్నట్టు నముల్తావుంది ముంజెయ్యి" అంటూ కుడి చెయ్యి పిసికిలిపట్టి నేలకేసి బాదుకుంటూ పెద్దమ్మగార్ని విసుక్కోడందాకా వచ్చింది.

మా అత్తగారు దాని ధోరణి మారిందని గ్రహించి నిట్టూర్చారు. రానురానూ, మాట్లాడితే అందరిమీదా కస్సుమంటం మొదలెట్టింది నరసమ్మ అంతవరకూ బాగా పనిచేస్తూవచ్చిన నరసమ్మకు అంత విసుగూ, చిరాకూ ఎందుకు కలిగాయో నా కర్థంగాలేదు. మనిషి మళ్ళీ మంచిదే !....కష్టపడి పనిచేసేదే .... ఒళ్ళు దాచుకునే స్వభావం అసలు లేనేలేదని మొదట్నే తెలిసింది. మరి ఎందు కల్లా విసుక్కుంటోందో నాకు బోధపళ్ళేదు....

మధ్యాహ్నం మా అత్తగారు భోంచేసి, హాల్లో నడుం వాలుస్తూ, నరసమ్మను పిలిచి "అరికాళ్ళు మంటలుగా వున్నయ్. కాస్త ఆముదం పట్టించవే" అన్నారు.

"అబ్బ! నా శాతగాదు పెద్దమ్మగారూ.... యిప్పుడు నే నేం జెయ్ లేను .... నా ఒంట్లో కాస్తగూడ బాగులేదు .... యిక నే నాగా జెడితే యీ యింటెడు శాకిరీ ఎవురు జేత్తారనీ? పేణం బిగబట్టుకుని చేత్తావుండా .... కాసే పట్ట గొడ్లకొట్టంకాడికెళ్ళి నడుం వాలుత్తానమ్మా" అంటూ పెరటి వేపు వెళ్ళింది .... మా అత్తగారు గతుక్కుమన్నారు.... "యిదైనా కొంత కాలం వుంటుందని ఆశపడ్డాను .... వాలకం చూస్తే బాగా లేదు ... ఊఁ" అంటూ నిట్టూర్చారు బరువుగా.

నరసమ్మ తత్వం అర్థం చేసుకున్న నేను నరసమ్మ పని వదిలి వెళ్ళ దని తెలుసుకున్నాను .... కాని దానికేవో కొన్ని యిబ్బంది లున్నాయనీ, అందువల్లే విసుక్కుంటూందనీ గ్రహించాను ..

మా అత్తగారు మంచి నిద్రలో వున్నారు .... వంటవాడు పరిగెత్తు కుంటూ వచ్చి "అమ్మగారు అమ్మగారూ! పెరటివేపు మీ కొక తమాషా చూపిస్తాను, త్వరగా రండి!" .... అన్నాడు. వాడి వెనకాలే పెరటివేపు వెళ్ళాను.... వాడు అడుగులో అడుగు వేసుకుంటూ, చప్పుడు కాకుండా, గొడ్లకొట్టం దగ్గిరికి తీసుకెళ్ళాడు. ఓ మూలవున్న చిన్న కిటికీలోనుంచి లోపలికి తొంగిచూశాను ....

జాలీగా లల్లాయిపదం పాడుతూ, దర్జాగా కూర్చుని, బారెడు చుట్ట నోట్లో పెట్టుకుని కాలుస్తూ యీ లోకాన్నే మర్చిపోయిన నరసమ్మ కనిపిం చింది.... వంటవాడు మూతికి తుండుగుడ్డ అడ్డం వుంచుకుని నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయాడు.

ఆనందంలో ఒళ్ళు మరచి చుట్టపొగను ఆస్వాదిస్తున్న నరసమ్మ ఆ సమయంలో నా కంటికి ఉమర్ ఖయ్యాంలా కనిపించింది .... పక్కనే సాఖీలా వున్న ఆవుదూడ నరసమ్మను ఆనుకుని కూర్చుంది.

నిశ్శబ్దంగా వచ్చేశాను ... నేను చూసిన దృశ్యం మా అత్తగారే చూస్తే! ....

లోపలి కొస్తూనే వంటవాడు చెప్పాడు.... నరసమ్మ కా విసుగంతా చుట్ట కాల్చడానికి తీరిక లేకనే అనీ, చివరకు తోటవాడిని బ్రతిమాలి నాలు

గణాలు అడిగి తీసుకుని వెళ్ళి చుట్టపొగాకు తెచ్చుకొందనీ, అగ్గిపెట్టె వంటింట్లోంచి పట్టికెళ్తుంటే వెనకాలే వెళ్ళి చూశాననీ చెప్పాడు.

ఈ సంగతి పెద్దమ్మగారికి తెలీకూడదని వంటవాడికి గట్టిగాచెప్పాను.

కాసేపటికి నరసమ్మ అతి హుషారుగా నవ్వుకుంటూ హాల్లో కొచ్చి చేతులో వున్న ఆముదం సీసా ఓ పక్కన పెట్టి, మా అత్తగారి కాళ్ళదగ్గిర కూర్చుంది. గాఢ నిద్రలోవున్న మా అత్తగారి రెండు కాళ్ళూ బర్రున తన ముందుకు లాక్కుంది. "ఓ యమ్మ! ఎవరేవ్...." అంటూ మా అత్తగారు వులిక్కిపడి లేచారు....నరసమ్మ పకపక నవ్వేసి "నే నమ్మా! కాళ్ళిట్టియ్యండి.... ఆమదం రుద్దుతా"..అన్నది.."యిప్పుడొద్దే" అని మా అత్తగారు అంటున్నా వినకుండా "మీకు తెలపదమ్మగారూ! మీ రూరు కోండి—కాళ్ళిట్టియ్యండి...." అంటూ బలవంతంగా ఆమె రెండు కాళ్ళూ లాక్కుని అముదం రుద్దడం మొదలెట్టింది .. యింకా గట్టిగా ఒద్దంటే తంతుందేమో అని మా అత్తగారు భయపడ్డట్టు గ్రహించాను. నరసమ్మలో కలిగిన ఆ మార్పు ఏమిటో అర్థంగాక మా అత్తగారు అయోమయంగా నావైపు చూశారు. ఆముదం రుద్దినంతసేపూ నరసమ్మ ఏదో కబుర్లు చెప్పి వంటవాడిని వెక్కిరిస్తూ నవ్వుతూనేవుంది. అది నవ్వేకొద్దీ మా అత్తగారి ముఖం ఓ పెద్ద క్వశ్చన్ మార్కులా తయారయింది....

"నాసు టోలెడు అంట్లున్నయ్యమ్మోయ్....ఆ ఎదవ సచ్చినోడు బండె దేత్తాడు టొచ్చెలు....అంట్లు తోమీ, యిల్లుజిమ్మీ, సాయంత్రంగా మీ యీపుకి అమృతాంజనం రుద్దీ, ఏణ్ణీళ్ళు కాపటం ఏస్తా....మీరు మడిగట్టు కున్నా సరే తాకుతా''....అంటూ, పకపక నవ్వుకుంటూ అంట్లుతోమడానికి వెళ్ళింది నరసమ్మ మా అత్తగారు హుషారుగా వెళ్తున్న నరసమ్మ వైపే చూస్తూ, "ఏమిటే యిదీ....ఒట్టి ఖయ్యాళీ మనిషిలా వుందే'' అన్నారు. నవ్వి వూరుకున్నా.

సాయంకాలం మా అత్తగారు చూడకుండా నరసమ్మను రహస్యంగా పిలిచి, దాని చేతులో అయిదు రూపాయలు పెట్టాను.... తెల్లబోయి 'నా కెందు కీ రూపాయ' లన్నట్లు నా వైపు చూసింది.... "నీ సొంతఖర్చుకు

వుంచుకో.... నీ దగ్గిర డబ్బు ఏమీ లేదు కూడాగా!.... వాళ్ళనీ వీళ్ళనీ చిల్లర డబ్బు లడక్క.... అందుకే యిస్తున్నా".... అన్నాను.

నరసమ్మ కేదో అనుమానం కలిగి, "నాకేం ఖర్చుందమ్మగారూ...." అంది నేల చూపులు చూస్తూ.... "నాకంతా తెలుసులే నరసమ్మా!".... అన్నాను నవ్వుతూ.... యిక నా వైపు చూట్టానికి ముఖం చెల్లని నరసమ్మ చటుక్కున నా రెండు పాదాలూ పట్టుకుని, "అమ్మగారు, అమ్మగారు, నన్ను చమించండి.... ఎదవలవాటు పొగాక్కంపెనీలో పనిచేసేదాన్ని.... ఆడ ఆడోళ్ళంతా కాలస్తావుంటే అలవాటయింది ... కోపగించుకొని పంపిం చెయ్యకండమ్మగారూ.... దిక్కులేందాన్ని.... మీ నీడనే పడుందామను కున్నా.... అలవాటయిన మూలాన పిచ్చెత్తినట్టుంటది.... వంటోడికీ, పెద్దమ్మగారికీ భయపడి యీ వారంరోజులూ పళ్ళు గరుసుకుని పనిజేశా.... యీ విషయంలో మీరు కోప్పడకపోతే యిక ఎంతపనన్నా జేత్తా .... లేక పోతే ఏంటో నోరు తుత్తర బుట్టి పిచ్చెత్తినట్టుంటదమ్మా—కాసేపు సుట్ట గాలిత్తే యిక ఆగమేగాలమీద పనిజేత్తా"—అని నరసమ్మ చెపుతుంటే నాకు నవ్వొచ్చింది.

"అలాగేకానీ.. పెద్దమ్మగారికి తెలీకుండా మటుకు చూడు" అన్నాను.

"అమ్మో! అమ్మో! ఎంతమాట, ఎంతమాట!—అట్టంతా తెలీ నిత్తనా అమ్మా! ఆయమ్మ ఎంత మడో, నాకు తెలపదూ!''—అంటూ చెంపలేసుకుంది... వెనుకనించి నరసమ్మ యాక్షను చూస్తున్న వంటవాడు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ తలుపు చాటున దాక్కున్నాడు.... ఆ రోజు నుంచీ నరసమ్మ మళ్ళీ మామూలుగా ఎగిరెగిరి పనిచేయడం చూసి మా అత్త గారి ముఖంలో కళ కనిపించింది.... కాని దాని అరుపులూ, కేకలూ ఎక్కువ యినయ్ అనేదే అందరి కంప్లెయింటూ!

ఎప్పుడైనా దానికి చుట్ట కాల్చేవ్యవధి దొరకనప్పుడే ఆ కేకలూ, అరుపులూ వినిపిస్తుంటాయని నాకూ, వంటవాడికీ మాత్రమే తెలుసు.... ఆ తర్వాత పకపక నవ్వుతూ పనిచేస్తుంటుంది.

ఆ విషయం యింకా మా అత్తగారికి తెలియని రహస్యంగానే వుండి పోయింది ....